క్లుప్తంగా

200 మందికి అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు మారుతి రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి వెంకటేశ్వరరావు వితరణతో అన్నదానం జరిగింది. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నున్నలో సురక్ష వైద్యశిబిరం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం సచివాలయం-2 వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తారని గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.టి.వి.రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం పరిధిలో వైద్య సిబ్బంది ద్వారా స్లిప్పులు పొందిన వారు ఆరోగ్య పరీక్షలు, చికిత్స కోసం వైద్యశిబిరానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

పెనమలూరు: పోరంకిలో ఈ నెల 2వ తేదీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఎం.జె. నాయుడు ఆస్పత్రి గౌరవ అధ్యక్షుడు వావిలాల రజినీకాంతశర్మ తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ పోరంకి శ్రీనివాసనగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరం వద్ద ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, ఎముకల అరుగుదల, పక్షవాతం తదితర వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామని వివరించారు.

ఈడుపుగల్లు వాసికి ఈతలో పతకాలు



కంకిపాడు: ఈత పోటీల్లో ఈడుపుగల్లు వాసికి పతకాల పంట పండింది. గత నెల 27, 28, 29 తేదీల్లో మొదటి ఓపెన్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ చాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీలు దుబాయ్‌లో జరిగాయి. ఈత పోటీల్లో మాస్టర్స్ విభాగంలో ఈడుపుగల్లుకు చెందిన బిళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, మూడు వెండి పతకాలను సాధించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ పతకాలను సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు.

పాడి రైతుల అభ్యున్నతికి కృషి

కంకిపాడు: పాడిరైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు అన్నారు. ఈడుపుగల్లు పంచాయతీ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువపై మంగళవారం రుణమేళా, అవగాహన సదస్సు నిర్వహించారు. బాకీబాబు మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకు ద్వారా ప్రత్యేక రుణాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, ఎంపీటీసీలు బూరగ బాలాజీ, షేక్ అమీనాబి, పశువైద్యాధికారి కర్నాటి మాధవరావు, వెలుగు ఏపీఎం సాంబశివరావు, నాగదేశి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా ముందుకు..



కంకిపాడు: లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. ఈడుపుగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కౌమారదశలో ఉన్న బాలికలకు మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాకీ బాబు మాట్లాడుతూ మంచి, చెడు ప్రవర్తనల వ్యత్యాసాలను తెలుసుకోవాలన్నారు. బాహ్య సమాజంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే తీరును అలవర్చుకోవాలన్నారు. ఆపద ఎదురైతే తమని తాము రక్షించుకోవడంపై శిక్షణ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 బి.వి.శేషగిరిరావు, హెచ్ఎం బి.పద్మావతిబాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మరియమాత మాస ఊరేగింపు

పటమట(విజయవాడతూర్పు): పటమట సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణకర్తలు, విజయవాడ కథోలికపీఠం మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మరియమాత పూజిత మాస ముగింపు ఊరేగింపు జరిగింది. ఊరేగింపు నిర్మల కాన్వెంట్ నుంచి సెయింట్‌పాల్స్ కథెడ్రల్ వరకు సాగింది. అనంతరం ఆయన అసిస్టెంట్ ఫాదర్ ఎం.కిషోర్‌తో కలిసి సమష్టి దివ్యపూజాబలిని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ నెలను మరియమాత అంకిత పూజిత మాసంగా ప్రకటించడంతో నెల రోజుల పాటు కథోలిక క్రైస్తవులు మరియమాతను పూజిత అంకిత మాసం జరుపుకుంటున్నామన్నారు. ఈ నెల రోజులు క్రైస్తవులకు పవిత్రమైన జపమాలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చర్చి విచారణ పెద్దలు బండి బాబూరావు, మధుర బెర్నెడ్, నిర్మలా కాన్వెంట్ సిస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

'సాక్షి' స్పెల్‌బీకి విశేష స్పందన



కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కానూరు షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో..

- సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహణ
- నాలుగు కేటగిరీల్లో విద్యార్థులకు పరీక్షలు
- నగరంతో పాటు పలు పాఠశాలల్లో పరీక్ష

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషపై ఉన్న భయాన్ని పోగొట్టి భాషపై పట్టు సాధించడానికి 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులను వారు చదువుతున్న తరగతిని బట్టి నాలుగు కేటగిరీలుగా విభజించి పరీక్షను నిర్వహించారు. పాఠశాల స్థాయిలో జరిగిన ఈ స్పెల్ బీ పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయి తర్వాత రీజనల్, రాష్ట్ర స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. స్పెల్ బీ పోటీ పరీక్షకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పదాలను ఎలా పలకాలో తెలిసింది



ఈ పరీక్షకు హాజరు కావడంతో ఇంగ్లిష్ పదాలను ఎలా పలకాలో తెలిసింది. ఇంగ్లిషు పదాలతో పాటు వాటి స్పెల్లింగ్‌లు కూడా ఎలా చదవాలో తెలుసుకున్నాను. ఇంగ్లిష్ భాషపై భయం పోయింది. ఈ స్పెల్ బీ పరీక్షలో పాల్గొని చాలా కొత్త ఇంగ్లిష్ పదాలను నేర్చుకున్నాను.

–వీసీ కమలేష్, 10వ తరగతి విద్యార్థి,
వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, విజయవాడ

కొత్త పదాలను నేర్చుకున్నా



ఇంగ్లిష్ భాషపై పూర్తి స్థాయిలో పట్టు సాధించేందుకు స్పెల్ బీ పరీక్ష ఎంతగానో దోహదం చేసింది. ఇంగ్లిష్ పదాల స్పెల్లింగ్‌లు, పలకడం తెలుసుకున్నాను. అనేక కొత్త పదాలను నేర్చుకున్నాను. ఇంగ్లిష్ మాట్లాడటంతో పాటు రాయడం కూడా నేర్చున్నాను.

–వీఆర్ వైష్ణవి, 9వ తరగతి విద్యార్థిని,
వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, విజయవాడ

పరీక్ష నిర్వహించిన పాఠశాలల వివరాలు

మంగళవారం నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు నగరంతో పాటుగా పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గుణదలలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో 357 మంది విద్యార్థులు, భవానీపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో 98 మంది, ఎంజీ రోడ్డులోని సెయింట్ జాన్స్ పాఠశాలలో 42 మంది, మొగల్రాజపురంలోని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ 165 మంది, కానూర్ షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ 146 మంది, సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో 114 మంది, ఆగిరిపల్లిలో హ్యాపీ వ్యాలీ స్కూల్‌లో 96 మంది, పోరంకిలోని సంవిధ విద్యాపీఠ్‌లో 37 మంది, కానూరు కేసీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో 84 మంది, ఈడుపుగల్లులోని నలంద స్కూల్‌లో 37 మంది, విజయవాడ ఐదో నంబరు బస్సు రూట్ రోడ్డులోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 80 మంది, గూడవల్లిలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 293 మంది, గాయత్రినగర్‌లోని నలంద హైస్కూల్‌లో 25 మంది, ఆచార్యరంగా నగర్‌లోని నలందా స్కూల్ 75 మంది విద్యార్థులు స్పెల్‌బీ పరీక్ష రాశారు.



ఈడుపుగల్లులోని నలంద స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సూరంపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



గన్నవరంరూరల్: జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులు అమలుచేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అన్నవరపు నాగేశ్వరరావు కోరారు. మండలంలోని సూరంపల్లిలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడుల నిరోధానికి అవగాహన అవసరమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి విజ్ఞప్తిపై గ్రామాల్లో సివిల్ రైట్స్‌డే నిర్వహణకు చర్యలు తీసుకున్న గుడివాడ ఆర్డీఓ పద్మావతికి, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ పులపాక బాబూరావు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

గన్నవరం: కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను వాసుదేవరావు ఎగురవేశారు. నేతలు పెద్దు వెంకటరత్నం, ముక్కామల ఉమామహేశ్వరరావు, కట్టవరపు విజయరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్యం

రామవరప్పాడు: పేదల చెంతకే వైద్యసేవలు అందుతున్నాయని రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి అన్నారు. రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనిలో సుమారు 600 మందికి సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, చర్మ, కంటి, దంత, గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి జగన్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోలేని పేదలకు ఈ కార్యక్రమం సువర్ణ అవకాశమన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భార్గవి, పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. యనమలకుదురు సచివాలయం-3 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మునిసిపాలిటీ పరిధిలోని 19 గ్రామ సచివాలయాల్లో ఇప్పటివరకు 17 గ్రామ సచివాలయాల్లో వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఫజల్‌హక్, నల్లమోతు జీవన్, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందిస్తున్న సర్పంచ్, జెడ్పీటీసీ తదితరులు

గన్నవరం: మండలంలో నెల రోజులుగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. చివరి రోజున కేసరపల్లి శివారు వీఎన్ పురం కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. తొలుత సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన ఏర్పాటు చేసిన క్యాంప్‌ను ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె. కరీముల్లా, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: తేలప్రోలు జెడ్పీ హైస్కూల్ వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 1,204 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ లాం దిబోర, ఉప సర్పంచ్ వింత ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు టి.వాణి తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్ ప్రకాశరావు



వీఎన్ పురంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు వరం.. కంటి వెలుగు

- జగనన్న ఆరోగ్య సురక్షలో సమర్థంగా అమలు
- పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు
- విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా కళ్లజోళ్లు



ఉయ్యూరులో విద్యార్థులకు కంటి పరీక్షలు

కంకిపాడు: విద్యార్థులకు 'కంటి వెలుగు' వరంగా మారింది. దృష్టి లోపంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు.. విద్యార్థుల కంటి సంరక్షణకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్షలో పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసింది.

తొలి దశలో 15,570 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రభుత్వ ఆదేశాలతో ఏపీ వైద్య విధాన పరిషత్ మార్గదర్శకాలకు అనుగుణంగా కృష్ణా జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 11 నుంచి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ కృష్ణా జిల్లా పరిధిలో 11 బృందాలను ఏర్పాటు చేసింది. ఆప్తాలమిక్ ఆఫీసర్లు కంటి పరీక్షలు చేస్తుండగా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సహాయకులుగా వ్యవహరించారు. ప్రధానంగా కంటి సంబంధ వ్యాధులు, మెల్లకన్ను, శుక్లాలు, ఇతర కంటి సమస్యలను గుర్తించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సచివాలయ స్థాయిలో గత నెల 30న చేపట్టారు. అప్పటికి జిల్లాలో 139 ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో కంటి వైద్య పరీక్షలు జరిగాయి. 15,570 మంది విద్యార్థులకు పరీక్షలు చేయించారు.

1,637 మందికి కళ్లజోళ్లు

విద్యార్థుల కోసం ప్రత్యేకించి ఏర్పాటుచేసిన 11 బృందాలు ఆయా పాఠశాలల్లో కంటి పరీక్షలు చేసి దృష్టి లోపాలు ఉన్న 1,637 మంది విద్యార్థులను గుర్తించాయి. విద్యార్థులకు అవసరమైన కళ్లజోళ్ల పంపిణీకి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో తొలి దశ పరీక్షలు పూర్తయిన మండలాల వారీగా పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్లను అందించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి కళ్లజోళ్లు మండలాలకు చేరుకున్నాయి. త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

తగ్గుతున్న కంటి సమస్యలు

గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. జిల్లాలో 1,800 మంది విద్యార్థులకు దృష్టి, కంటి సంబంధ సమస్యలు ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ నివేదికలు చెబుతున్నాయి. అలాంటిది ప్రస్తుత తాజా వైద్య పరీక్షల్లో ఆ సంఖ్య 1,637గా నమోదైంది. దీనికి పాఠశాలల్లో అందుతున్న పౌష్టికాహారమే ప్రధాన కారణమని కంటి వైద్య నిపుణులు చెబుతున్నారు.

కళ్లజోళ్ల పంపిణీకి చర్యలు



గత నెలలో జిల్లాలో ఉన్న 139 పాఠశాలలను తొలి దశలో సందర్శించి వైద్య పరీక్షలు చేశారు. 1,637 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి నాణ్యమైన కళ్లజోళ్లను అందిస్తున్నాం. మండలాలకు ఇండెంట్ ప్రకారం సరఫరా చేస్తున్నాం. త్వరలోనే అందిస్తాం

– బి.నాగజ్యోతి,
కంటి వెలుగు ప్రోగ్రామ్ ఆఫీసర్, కృష్ణాజిల్లా

సమర్థంగా పరీక్షలు



ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆరోగ్య సురక్ష సమర్థంగా అమలు జరుగుతోంది. ఆప్తాలమిక్ ఆఫీసర్లు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల కంటి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ చేశారు. నిర్ధారణ పరీక్షలు సమర్థంగా సాగాయి. పౌష్టికాహారం తీసుకుంటే కంటి సమస్యలను అధిగమించొచ్చు.

–డాక్టర్ గీతాబాయి,
డీఎంహెచ్ఓ, కృష్ణాజిల్లా

జాతీయ భావం పెంపొందించుకోవాలి

పెనమలూరు: ప్రతి ఒక్కరూ జాతీయ భావం పెంపొందించుకొని దేశాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని భట్టరాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలిదేవి అన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా యనమలకుదురులో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. గీతాంజలిదేవి మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశానికి మొదటి హోం మంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ పని చేశారన్నారు. ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కోటంరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కానూరులో..

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం, నెహ్రూ యువకేంద్రం సంయుక్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుంకర రాము, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరం: వలభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటి కార్యక్రమం నిర్వహించారు. దావాజీగూడెంలో రన్‌ను డీఎస్పీ జయసూర్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సెయింట్‌జాన్స్ హైస్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల మీదుగా బుద్దవరం రోడ్డు వరకు కొనసాగింది. రన్‌లో గెలుపొందిన సిబ్బందికి, విద్యార్థులకు డీఎస్పీ జయసూర్య బహుమతులు ప్రదానం చేశారు. గన్నవరం, హనుమాన్‌జంక్షన్ సీఐలు పి.కనకరావు, నరసింహమూర్తి, పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు ఎన్.లూథర్‌పాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు వల్లభాయ్ పటేల్ పట్టుదల, కృషిని ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలన్నారు. దేశ సమగ్రత, ఐక్యతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కరరావు, ఉపాధ్యాయులు పరస రాజేష్, వెంకట కుమారి, పద్మ, వ్యాయామోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్: రూరల్ మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ బి.భార్గవి, కార్యాలయం సిబ్బంది పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటం వద్ద కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు దేశ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రాజకిషోర్, డాక్టర్ లక్ష్మీరాణి, డాక్టర్ మల్లికార్జునరావు, వసంత, సిబ్బంది పాల్గొన్నారు.



యనమలకుదురులో సమైక్యతా ర్యాలీ



దావాజీగూడెంలో రన్ ప్రారంభిస్తున్న డీఎస్పీ



రేమల్లేలో విద్యార్థుల సమైక్యతా ర్యాలీ



పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ భార్గవి, సిబ్బంది



వెటర్నరీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు పోటీలు

పటమట(విజయవాడతూర్పు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సర్వోత్తం గ్రంథాలయం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు నవంబర్ 2-4 తేదీల్లో చిత్రలేఖన, కథలు చెప్పటం, పుస్తక సమీక్ష, పైకి చదవటంతో పాటు సాహితీ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోత్తమ గ్రంథాలయం కార్యదర్శి రావి శారద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సబ్ జూనియర్లకు(1-4 తరగతులకు) కథలకు బొమ్మలు వేయటం, కథలు చెప్పటంలో పోటీలు, జూనియర్లకు(5-7 తరగతులకు) పైకి చదవటంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సీనియర్లు(8-10 తరగతులు)పైకి చదవటం, పుస్తక సమీక్ష, రాయటంలో పోటీలు, 4వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు కళాశాల విద్యార్థులకు పుస్తక సమీక్ష, సాహితీ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు నగరంలోని నుంచి విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

•విద్యార్థులు తరచూ రక్తదానం చేయాలి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రక్తదానం ప్రాణాలను కాపాడే మహాదానమని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో సీజీఎస్టీ విజయవాడ డివిజన్ సహకారంతో కళాశాల ప్రాంగణంలో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సమానుకూలంగా రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఎస్టీ విజయవాడ డివిజన్ సహాయ కమిషనర్ వీఎస్‌కే రాయులు తదితరులు పాల్గొన్నారు.